సీరియల్

అంగారక

శ్యాంబాబు

(మొదటి భాగము)

మిస్ నదీరా కేబెరే ప్రేక్షకుల్ని అల్లకల్లోలం చేస్తోంది.

రోజారంగు శరీరంమీద పలచని వస్త్రులు ఇప్పుడో, మరోక్షణానో క్రిందికి జారిపోతాయేమో అనిపిస్తోంది. హాలులో మూలగావున్న రాక్ సెట్ అల్ట్రామోడరన్ రాక్ మ్యూజిక్‌లో జతపడిన నదీరా అవయవాల సొంపులు జనం నరాల్ని సాగతీస్తున్నాయి.

జయపాండ్యన్ సిగరెట్ వెలిగించి డిప్లమాట్ బాటిల్ని పూర్తిగా గ్లాసులోకి ఒంపుతున్నాడు. గటగట సగం గ్లాసు త్రాగేసి ముందున్న ఖాళీ ప్లేట్ వైపు చూశాడు.

"బేరర్! సమ్ మోర్ చిప్స్!"—అరిచాడు అసహనంగా.

క్షణాల్లో అతనిముందు చిప్స్ ప్రత్యక్షమయ్యాయి. "వన్ మోర్ క్వార్టర్!" అన్నాడు నదీరా శరీరం మీది నుండి కళ్ళు త్రిప్పకుండా.

అర్ధరాత్రి పన్నెండువరకూ నదీరా నృత్యం సాగుతూనేవుంది. జయపాండ్యన్ వరుసగా విస్కీసీసాలు ఖాళీ చేస్తూనేవున్నాడు. కళ్ళలో ఎర్రటి చారలు ఏర్పడుతున్నాయి. బాండుమ్యూజిక్ లీలగా మాత్రమే వినబడుతోంది. నదీరా శరీరం బొంగరంలా తిరుగుతూ శరీరమంతా ఒకే అవయవంలా కనబడుతోంది.

ప్రేక్షకుల్లో అరుపులు, ప్రేమనినాదాలు, ఈలలు ఎక్కువయ్యాయి. నదీరా శరీరంమీది పల్చనివస్త్రం గిర్రున తిరుగుతూ గాలిలోకి లేచింది. అనేకమంది వుత్సాహంగా కుర్చీల్లోంచి లేచిపోయి టేబిల్స్ మీదినుండి ముందుకువంగి ఆత్రుతగా చూడసాగారు.

ఉన్నట్లుండి పెద్దశబ్దంతో రాక్ మ్యూజిక్ ఆగిపోయింది. గిర్రున బొంగరంలా తిరుగుతున్ననదీరా శరీరం బ్రేక్ పడినట్లు ఆగింది. ఆమె వంటిమీద గౌను కుప్పలా నేలమీద పడిపోయింది. చటుక్కున లైట్లు ఆరిపోయాయి. జనంలో హాహాకారాలు చెలరేగాయి.

అరనిముషంలో లైట్లు వెలిగేటప్పటికి మిస్ నదీరా మెరుపులా మాయమయింది.

"డామిట్!"_అనుకున్నాడు జయపాండ్యన్ కసిగా.

మెల్లిగా కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు. ఎంతతాగినా అతని శరీరం సాధారణంగా స్వాధీనం తప్పదు. కానీ ఈరోజు బాగా ఎక్కువగానే త్రాగాడు, మిస్, నదీరా

అల్ట్రా సెక్సీ నాట్యం అతని నరాల్ని స్వాధీనం తప్పిస్తోంది. పర్సుతీసి రెండువందల రూపాయలు నిర్లక్ష్యంగా ప్లేట్‌లో పడేసి బయటికి నడిచాడు.

ఇంకా కొందరు తాగుబోతులు నదీరా మళ్ళీ కనిపిస్తుందనే ఆశతో క్రొత్తబాటిల్స్‌ను ఆర్డరిస్తున్నారు.

"గుడ్ నైట్ సర్!"—అన్నాడు గేటుకీపరు తలుపు తెరిచి పట్టుకొంటూ.

చిన్నగా తలాడించి బయటికి నడిచాడు జయపాండ్యన్. మెదడంతా మొద్దుబారినట్లుగావుంది. కాస్త దాహంగా వుంది. జేబులోనుండి సిగరెట్ తీసి వెలిగించి టాక్సీకి చెయ్యి వూపాడు.

టాక్సీలో ఎక్కి కూర్చుని "సన్ సెట్ ఎవెన్యూ"—అన్నాడు బ్యాక్ రెస్ట్‌పై తలానిస్తూ.

మేజర్ జయపాండ్యన్ ఆర్మీనుండి డిశ్చార్జ్ అయి పదిహేను రోజులవుతుంది. ఒక సహచరుడి పొరపాటు వలన మాక్ బాటిల్ ప్రాక్టీసులో లైవ్ గ్రెనేడ్ పేలిఅతని ఎడమకాలివేళ్ళు నాలుగు తెగిపోయాయి. మూడు నెలలు ఆస్పత్రిలో చికిత్స తరువాత జయపాండ్యన్‌ను ఆర్మీ నుండి శాశ్వతంగా డిశ్చార్జ్ చేశారు.

జయపాండ్యన్ అందమైన వ్యక్తి అంటే కొందరు ఒప్పుకోకపోవచ్చు. కాని అతను కురూపి అంటేమాత్రం ఎవ్వరు అంగీకరించరు. అయిదడుగుల పదకొండు అంగుళాల ఎత్తు. విశాలమైన ఛాతీ, కండలు తిరిగిన శరీరం. ఆర్మీలో రోజూ కసరత్తు చేయడం వలన ఎప్పుడూ సెంట్ పర్సెంట్ కండిషన్‌లో వుండే శరీరం అతనిది.

ముప్పైఏళ్ళ వయస్సులో అనుకోకుండా అతని ఆర్మీ కెరీర్ అంతమవకుండావుంటే బహుశా రిటైరయ్యేప్పటికి

యే మేజర్ జనరల్ అయినా అయ్యుండేవాడు జయ పాండ్యన్. శారీరకశక్తి, పదునయిన తెలివితేటలు వున్నాయతనికి.

జయపాండ్యన్‌కు పెళ్ళయి రెండేళ్ళయింది. పెళ్ళి అయిన పదిరోజుల్లో అతనికి కెప్టన్‌నుండి మేజర్‌కు ప్రమోషన్ వచ్చిందన్న వార్త రావడంతో సుమిత్ర అదృష్టానికి అందరూ మురిసిపోయారు. ఐతే పెళ్ళయిన మూడు నెలలకే బోర్డర్‌కి తన బెటాలియన్ తరలి వెళ్ళడంతో వెంట భార్యను తీసుకెళ్ళే అవకాశం లేకపోయింది జయ పాండ్యన్‌కు.

పెళ్ళయిన తరువాత కలిసివున్నరోజులు అతితక్కువే అయినప్పటికి భార్య సుమిత్ర అంటే ఎంతో ప్రేమ జయ పాండ్యన్‌కు. ఐతే ఆర్మీనుండి డిశ్చార్జయి వచ్చిన ఈ పదిహేను రోజుల్లో ఎందుకో సుమిత్ర ప్రవర్తన విచిత్రంగా అనిపించింది జయపాండ్యన్‌కు. ఇదివరలో రెండు సార్లు శెలవులో ఇంటికి వచ్చినప్పుడు తనవెంట ఆప్యాయంగా, ప్రేమగా చూసుకొన్న సుమిత్రలో ఈసారి ఆ ఉత్సాహంగానీ, ఆపేక్షగానీ కనిపించలేదు జయ పాండ్యన్‌కు.

మొదటి నాలుగురోజుల్లో అంతగా గమనించలేదు గానీ, తర్వాత తర్వాత తన సామీప్యానికి, తనతో సాంగత్యానికి సుమిత్ర చూపుతున్న విముఖత అంతులేని పజిల్లా పట్టుకొంది జయపాండ్యన్‌కి.

ఆర్మీనుండి డిశ్చార్జయి వచ్చిన ఈ రెండువారాల్లోనే సుమిత్ర సందర్భరహితంగా యిప్పటికి నాలుగుసార్లు పోట్లాడింది తనతో. ఆక్సిడెంటు వలన స్వల్పంగా మానసికంగా దెబ్బతిన్న జయపాండ్యన్‌కు ఇది మరింత క్షోభ

కలుగజేసింది.

దాని ఫలితమే సరదాగావున్న హాబీ ఈ వారంతో క్రమమైన అలవాటుగా తయారయింది బార్కు వెళ్ళే రూపంలా.

* * *

ఐదురూపాయలనోటు టాక్సీడ్రయివర్ చేతిలోపెట్టి, కారు దిగాడు జయపాండ్యన్.

జనవరినెల వచ్చినా కొద్దికాలంలో ఇంకా చలి తగ్గలేదు. శరీరంలో అంత ఆల్కహోలువున్నా చలి తీవ్రతకు సన్నగా ఒళ్ళు జలదరించింది జయపాండ్యన్కు.

తలెత్తి తను వుంటున్న అపార్ట్మెంట్ కిటికీవైపు చూశాడు. లైటు వెలుగుతుంది. అంటే సుమిత్ర ఇంకా మేలుకునే వుందన్నమాట. వుత్సాహంగా మెట్లవైపు అడుగులు వేశాడు.

సన్సెట్ ఎవెన్యూలో పెద్ద అపార్ట్మెంట్స్ వున్న భవనం అది. క్రింది అంతస్తులో పదివాటాలూ, పై అంతస్తులో పదివాటాలూ వున్నాయి. మేడమీద కుడివైపు మెట్లకు ఎడమవైపు అపార్ట్మెంట్ జయపాండ్యన్ది. సన్నగా ఈల వేసుకుంటూ మెట్లు ఎక్కసాగాడు.

"గుడ్నైట్ మేజర్!"—అన్నాడు హౌస్కీపర్ తన మెట్ల ప్రక్కగదిలోంచి తొంగిచూసి...

"గుడ్నైట్ రామన్"—అన్నాడు జయపాండ్యన్ హుషారుగా మెట్లెక్కుతూ.

మెట్లకు ఎడమవైపువున్న తలుపు జయపాండ్యన్ అపార్ట్మెంట్ది. చివరిమెట్టు పైనవుండగా అపార్ట్మెంట్ తలుపు కొద్దిగా తెరుచుకోవడం గమనించాడు జయపాండ్యన్. నాలుగంగుళాలు తెరుచుకుందేమో

సందులోనుండి ఎవరిదో పురుషుడి ఆకారం స్పష్టంగా చూశాడు జయపాండ్యన్. తలుపు మళ్ళీ చటుక్కున మూసుకొంది.

బయటికి రాబోతున్నవ్యక్తి బహుశా జయపాండ్యన్‌ను చూసి తలుపు మూసేసివుండాలి. జయపాండ్యన్ గుండెలు వేగంగా కొట్టుకొన్నాయి. ఎవరది? దొంగా? చటుక్కున రెండంగల్లో తలుపు ముందుకు నడిచాడు.

తను ఇంట్లోలేని సమయం చూసి బహుశా దొంగెవడో ఇంట్లో చొరబడి వుండాలి. సుమిత్రను ఏం చేసాడో ఆ దుర్మార్గుడు. తను పైకి వస్తున్న సమయంలోనే బయటికి రాబోవడం వాడి దురదృష్టం. అపార్ట్‌మెంట్‌లో నుండి బయటికి రావడానికి వున్నది అదొక్కటే ద్వారం. వేరే మార్గం లేదు. లేకపోతే రోడ్డువైపువున్న కిటికీ తెరుచుకొని క్రిందకు దూకాలి.

దబదబ తలుపు తట్టాడు జయపాండ్యన్. లోపలనుండి ఏ చప్పుడూ వినిపించలేదు. పాండ్యన్ మనసులో ఆత్రుత ఎక్కువయింది.

"సుమిత్రా!"—గట్టిగా కేకపెట్టాడు. జయపాండ్యన్ గొంతు హాలులో ప్రతిధ్వనించింది.

చటుక్కున తలుపులు తెరుచుకొన్నాయి. సుమిత్ర బధ్రకంగా ఆవలిస్తూ కనిపించింది.

"ఎందుకలా తలుపులు బాదుతారు. బెల్ నొక్కితే చాలదూ!" అన్నది సుమిత్ర విసుగ్గా.

జయపాండ్యన్ ఆత్రుత క్షణంలో అనుమానంగా మారింది.

"నిద్రపోతున్నావా?".—

"లేదు. ఏదో చదువుకొంటున్నాను"—అదే సుమిత్ర

చేసిన మొదటి తప్పు.

తను మెట్లెక్కుతున్నప్పుడు అపార్ట్ మెంట్ తలుపు కొద్దిగా తెరచుకొని మూసుకోవడం, ఆ తలుపు సందు లోంచి కనిపించిన పురుషుడి ఆకారం మరిచిపోలేదతను. ఎన్ని పెగ్గులు విస్కీ తాగినా పరిసరాల్ని భ్రమించే మొద్దు మెదడు కాదతనిది. అయితే సుమిత్ర????

"ఎవరున్నారులోపల?"—అన్నాడు తలుపు తోసుకొని లోపలకు అడుగు పెడుతూ.

"ఎవరుంటారు?"—అన్నది సుమిత్ర అసహనంగా.

గదిలోకి అడుగుపెట్టి చటుక్కున తలుపు మూశాడు జయపాండ్యన్. ముందరిహాల్లో లైట్ దేదీప్యమానంగా వెలుగుతోంది. ఎవ్వరూ దాక్కోడానికి అనువైన ప్రదేశాలు ఏమీ లేవు.

చకచక బెడ్ రూమ్ వైపు నడిచాడు. అతని దృష్టి మంచంమీద నేలవరకూ వ్రేలాడుతున్న బెడ్ షీట్ పై పడింది. బెడ్డు అంతా నలిగి, దిండ్లు అస్తవ్యస్తంగా పడి వున్నాయి.

జయపాండ్యన్ కళ్ళు ఎర్రబడ్డాయి. అతనిలో క్రోధం బుసలుకొడుతోంది.

మంచంమీద ఓ మూలకివున్న 'అండర్ వేర్' పై అతని దృష్టి నిలిచిపోయింది. నీలంరంగు అండర్ వేర్ అది. మగ వాళ్ళది. తనెప్పుడూ వైట్ అండర్ వేర్స్ వాడతాడు. తనదికాదది. మరెవరిది?

చటుక్కున క్రిందికి వంగి, దుప్పటి పైకెత్తి మంచం క్రిందకు చూశాడు.

మంచం క్రిందనుండి భయం భయంగా చూస్తున్న ఆ వ్యక్తిని చూడగానే జయపాండ్యన్ లోని కోపం పరవళ్లు

త్రొక్కింది. కట్టలు తెంచుకొంది.

"బయటకు రారా పందీ!"_అరిచాడు జయపాండ్యన్.

మంచంక్రింది మనిషి భయంభయంగా ప్రాక్కుంటూ బయటికి వచ్చాడు. అతని మూతిమీద పఢేల్న తన్నాడు జయపాండ్యన్.

"అమ్మో!"—అంటూ అరిచాడు ఆ వ్యక్తి.

కాలరు పట్టుకొని వాణ్ని పైకిలేపాడు. ఎర్రటిమనిషి. చెమటలో అతడి ముఖమంతా తడిసి పాలిపోయి వుంది. అందమైన ముఖం. అతడి కళ్ళల్లో వేటగాడి చేతికి చిక్కిన లేడిపిల్ల చూపు. ఏదో చెప్పబోతూ నోరు తెరవబోయాడు.

అతని చెంపల్ని డప్పుల్లా వాయించాడు జయపాండ్యన్.

"నోర్మ్యూయ్. రాస్కెల్! నా బెడ్రూమ్లో చేరి ఏంచేస్తున్నావురా" కోపం పట్టలేక అతన్ని ఇష్టం వచ్చినట్లు బాదసాగాడు జయపాండ్యన్.

అతను భయంతో, బాధతో మూల్గుతూ నేలమీద మెలికలు తిరిగిపోతున్నాడు.

"ఆపు ఆపు. నీకు పిచ్చెక్కింది"—జయపాండ్యన్కు అడ్డంవస్తూ అరిచింది సుమిత్రా.

"యూ డర్టీ బిచ్. నిన్ను నరికిపారేస్తాను"—హుంకరించి సుమిత్ర జుట్టు పట్టుకొని వంచి వీపుమీద ధభీధభీ గుద్దసాగాడు జయపాండ్యన్.

జయపాండ్యన్ సుమిత్రవైపు తిరగ్గానే మంచంక్రింది మనిషి తలుపువైపు వుడాయించాడు.

చటుక్కున సుమిత్రను వదిలి వాడివెనకపడ్డాడు జయపాండ్యన్. జయపాండ్యన్ ముందుగదిలోకి వెళ్ళేలోపలే

బయట మోటారు సైకిలు స్టార్ట యిన శబ్దం వినిపించింది.

అపార్ట్ మెంట్ తలుపుమూసి బోల్ట్ వేసి పడగ్గదిలోకి వచ్చాడు జయపాండ్యన్. ఇప్పుడతనిలో ఇంతకుముందున్న ఆవేశం కనబడ్డంలేదు. ప్రేలబోయి అగ్నిపర్వతంలా ప్రశాంతంగా వున్నాడతను. అతని కళ్ళల్లోమాత్రం చెప్ప లేని కసి, క్రోధం, అవమానం కనిపిస్తున్నాయి.

సుమిత్ర నేలమీదపడి కీచుగా ఏడుస్తోంది.

"వాడేనా నీ ప్రియుడు. వాణ్ని చూసుకొనేనా నన్ను దగ్గరికి రానివ్వడంలేదు?"—అరిచాడు జయపాండ్యన్.

సుమిత్ర మాట్లాడలేదు. అతని కంఠంలో తీవ్రతకు ఏడుపు ఆపేసింది. ఏ క్షణాన అతని బూటుకాళ్ళు తాండవం చేస్తాయేనని శరీరం బిగుసుకుపోయింది.

"వై డోన్ట్ యు టాక్. యు గుడ్ ఫర్ నథింగ్ బిచ్"

సుమిత్ర మాట్లాడలేదు. భయంగాచూసింది అతని వైపు.

జయపాండ్యన్ శరీరంలో అణువణువూ అవమానంతో మండిపోతోంది. మెదడంతా మొద్దుబారిపోయి ఒకేఒక సంకేతాన్ని అతని అవయవాల కందజేస్తోంది.

"నువ్వుచేసిన మోసానికి నిన్ను చిత్రహింసచేసి చంపే యాలి" మామూలుగా, అతి సాధారణంగా, దాదాపు మృదువుగా పలికింది అతనికంఠం

ఆశ్చర్యంగా చూసింది సుమిత్ర.

జయపాండ్యన్ చేతిలో పాకెట్ నైఫ్ తళుక్కున మెరిసింది.

"నీ శరీరాన్ని ముక్కలు ముక్కలుగా నరికి నిన్ను చంపేవరకూ నాకు తృప్తిలేదు"—అన్నాడు జయ పాండ్యన్ సుమిత్రకు సమీపంగా వస్తూ.

సుమిత్ర అరవాలని నోరు తెరిచింది. జయపాండ్యన్ ముష్టిఘాతం సుమిత్ర మూతి పగలగొట్టింది. గొంతులోని ధ్వని గొంతులోనే ఆగిపోయింది.

బాధతో హృదయవిదారకంగా జంతువులా అరిచింది సుమిత్ర. ముందు పళ్ళుపూడి రక్తం విశేషంగా కార సాగింది. ముఖం నరాలు బిగుసుకుని వికృతంగా తయారయింది. భయంతో వెర్రిదానిలా చూసింది.

"ఇంతటితో అయిపోలేదు! బ్రతికుండగానే నీ కళ్ళు పొడిచేస్తాను" కత్తి ఝళిపిస్తూ ముందుకు వంగాడు జయపాండ్యన్.

అతనిలో తెలియని రాక్షసత్వం పూర్తిగా విజృంభించింది.

తుపుక్కున ఉమ్మింది సుమిత్ర. ఊడిన ముందుపళ్ళు రెండూ అతని ముఖంమీద పడ్డాయి.

జయపాండ్యన్ క్రోధం కట్టలు తెగింది. పాకెట్ నైఫ్ కొన కుడికంటిలో బలంగా దిగబడింది.

కెవ్వున అరిచింది సుమిత్ర...అలా అరుస్తూనేవుంది. కాళ్ళతో చేతుల్తో అతన్ని తన్నుతూ దూరంగా తోసేయడానికి ప్రయత్నం చేస్తోంది.

సుమిత్ర జుట్టుపట్టుకుని ఎడమకంటిని పొడవబోయాడు జయపాండ్యన్. గురితప్పడంతో బుగ్గమీది ఎముకలో కరకర శబ్దంచేస్తూ దిగబడింది కత్తి.

చెవులు చిల్లులుపడేలా కేకలు పెడుతోంది సుమిత్ర.

ఎవరో ముందుగది తలుపులు దబదబ బాదుతున్నారు.

రక్తంతో, గాయాలతో వికృతంగా గుర్తు తెలియకుండా తయారయింది సుమిత్ర ముఖం.

"బిచ్...బిచ్...షేమ్ లెస్ బిచ్!" కసిగా, మెథా

డికల్‌గా తిడుతూ, పాకెట్ నైఫ్‌తో ఆమె వక్షాల్ని చిల్లులు చిల్లులు పొడుస్తున్నాడు జయపాండ్యన్.

గదంతా ఒకటే ధ్వని. సుమిత్ర చేసే మృగంలాంటి అరుపుల ధ్వని...

జయపాండ్యన్‌కు ప్రపంచం తెలియడంలేదు. ఏమీ కనబడ్డంలేదు. మంచంమీద అండర్‌వేర్, అస్తవ్యస్తమైన తలగడలు, తలుపు సందులోంచి పురుషుడి ఆకారం అతని గుండెలు మండిపోతున్నాయి.

తలుపులు విరగ్గొడుతున్నా రెవరో, పరిగెడుతున్న శబ్దం, అరుపుల శబ్దం, సుమిత్రకు స్పృహ తప్పింది.

మూడంగుళాల పాకెట్ నైఫ్ బ్లేడ్‌ను బలంగా సుమిత్ర కంఠంలోకి దించాడు జయపాండ్యన్.

విపరీతమైన వణుకు. శరీరం అలా వణుకుతోంది.

ముందుగది తలుపు పెళపెళ మంటోంది. ఆలోచించకుండా కిటికీవైపు గెంతాడు జయపాండ్యన్.

* * *

బ్రిటిష్ ఎయిర్‌లేన్ జట్ విమానం మెల్లిమెల్లిగా క్రిందకు దిగుతున్నట్లు తెలుస్తోంది. కిటికీలోనుండి క్రిందకు చూశాడు. రంగురంగుల దీపాలతో వెలిగిపోతోంది హాంగ్‌కాంగ్ నగరం.

హాంగ్‌కాంగ్ చుట్టూవుండే సముద్రజలాల్లో, నగరం మధ్యనుండి పాయకాలవల్లో అటూయిటూ కదుల్తోన్న రంగురంగుల బల్బుల గుత్తులను ఓడలుగా గుర్తుపట్టాడు ఫ్రెడిక్ ఫెర్రిరా.

తొమ్మిదీ ఇరవైయేడు నిమిషాలకు ఏమాత్రం 'బంప్' లేకుండా మెత్తగా, త్రాచుపాములా రన్‌వే మీదకు దిగింది విమానం.

"ఎనిథింగ్ టు డిక్లేర్?" కస్టమ్స్ ఆఫీసరు ప్రశ్నకు అడ్డంగా తలాడించాడు ఫెర్రిరా.

పావుగంటలో కస్టమ్స్ ఫార్మాలిటీస్ ముగించుకొని ఎయిర్‌పోర్ట్ బయటకు నడిచాడు.

ఆరడుగుల ఎత్తు, ఎర్రటి ఒంటిరంగు, కింగ్ లూయిస్ పోర్ట్రెట్‌లాంటి గడ్డం మీసాలు, చెవిక్రింద కందిగింజంత పుట్టుమచ్చ. క్రీమ్‌కలర్ మాడ్-టు-ఆర్డర్ ప్యాంటు, తెల్లచుక్కలున్న యెర్రటిరంగు టై, షర్టుపైన సీల్ చర్మంతో కాలర్ కుట్టిన ఖరీదయిన స్పోర్ట్స్ కోటు— పెదిమలు బిగించి చకచక నడుస్తుంటే వయసులోవున్న యే ఆడదయినా ఓసారి వెనక్కితిరిగి చూడకమానదు.

టాక్సీలోయెక్కి కూర్చుని, "హోటల్ ఇంటర్నేషనల్" అన్నాడు ఫెర్రిరా వెనుకసీటుకు జారగిలబడుతూ.

అతని పాస్‌పోర్ట్‌లో యిచ్చిన వివరాల ప్రకారము, అతను భారతీయుడనీ, వృత్తి దంతవైద్యుడనీ, సరదాగా ఓ వారంరోజులు గడపడానికి హాంగ్‌కాంగ్ వస్తున్నాడనీ, అడ్రసు ఢిల్లీ అని తెలుస్తుంది—

కాని; అతని అసలుపేరు ఫెర్రిరాకాదనీ, దంతవైద్యం కాదుగదా, కనీసం మనిషినోట్లో ఎన్నిపళ్ళుంటాయనేదే అతనికి స్పష్టంగా తెలియదనీ, అతను హాంగ్‌కాంగ్ రావడానికి కారణం సరదాగా గడపడం కాదనీ ఎవరూ గ్రహించలేదు. అతని విషయం పట్టించుకోవలసిన అవసరం లేదెవరికీ.

*　　　*　　　*

హోటల్ ఇంటర్నేషనల్‌లో సరిగ్గా గంటసేపు గడిపాడు ఫెర్రిరా. ఈ గంటలో అతను తనగదిలో స్నానంచేసి దుస్తులు మార్చుకున్నాడు.

ఊదారంగు బుష్‌షర్ట్, నీలంరంగు పాంటు వేసుకున్నాడు. బూటుతీసేసి సింగపూర్ స్లిప్పర్లు తొడుగుకున్నాడు. పర్సులో నిండుగా హాంగ్ కాంగ్ కరెన్సీ కుక్కుకున్నాడు.

మరో విషయం. ఇప్పుడతని ముఖం సాదాగా, గడ్డం మీసాలు లేకుండా నున్నగా అప్పుడే షేవ్ చేసుకొన్నట్లు వుంది. స్నానం చేయబోయే ముందతను ఆ పెట్టుడు గడ్డం, మీసాలు తీసేసి ఓ చిన్న ప్లాస్టిక్ సంచిలో వేసి బిగించి ప్లష్టాంకులో పడేశాడు.

తనగదిలో లైటు ఆర్పి తలుపు తెరిచాడు.

నడవాలో ఎవరూ లేకపోవడం గమనించి, తలుపు తాళంవేసి చకచక మెట్లవైపు నడిచాడు. లిఫ్ట్ సర్వీస్ ఉపయోగించ దలచలేదతను. ఎందుకంటే వచ్చేపోయే వాళ్ళను పరీక్షగాచూసే లిఫ్ట్‌బాయ్‌కి తన ముఖంకొత్తగా కనిపించవచ్చు.

మెట్లుదిగి జన సమ్మర్ధంగావున్న హాల్లోంచి ఏ ఇబ్బందీ లేకుండా బయట పడటం కష్టం కాలేదతనికి. టాక్సీ ఎక్కకుండా రోడ్డమ్మటే పావుగంటసేపు నడిచాడు. తరువాత ఓ లాగుడురిక్షాలో కూర్చుని హాంగ్ కాంగ్‌లో నైట్ క్లబ్బులు ఎక్కువగా వుండే ప్రదేశానికి పోనిమ్మన్నాడు.

హాంగ్ కాంగ్‌లాంటి అధునాతనమయిన నగరంలో ఇంకా లాగుడురిక్షాలలాంటి అనాగరిక మైన వాహనాలు వుండడం ఆశ్చర్యమే. అయితే గమ్మత్తేమిటంటే హాంగ్ కాంగ్ రద్దీ వీధులలో టాక్సీ ఎక్కడంకన్న లాగుడు రిక్షాలు ఎక్కడమే సుఖం. ఎందుకంటే అంత రద్దీలో నీటిలో చేపల్లాగా రకరకాల వాహనాల్ని, మనుష్యుల్ని

తప్పించుకుని వేగంగా పోగలశక్తి, నేర్పు హాంకాంగ్ రిక్షావాళ్ళకే వున్నాయి.

దాదాపు అరగంట తర్వాత ఫెర్రిరా చెప్పిన హోటల్ ముందు రిక్షా ఆగింది. రిక్షావాడి చేతిలో ఓ నోటు పడేసి హోటల్ లోపలికి అడుగుపెట్టాడు ఫెర్రిరా. కౌంటర్ దగ్గర ముసలి చైనీస్ ఒకడు నలిగిపోయిన దినపత్రిక చదువుతూ కూర్చున్నాడు.

"గదికావాలి" అన్నాడు ఫెర్రిరా చేతిలోని ఓవర్ నైట్ బ్రీఫ్ కేస్ కౌంటర్ మీద పెడుతూ.

హోటల్ రిజిస్టర్‌ను ఫెర్రిరావైపు తోశాడు చైనా వాడు. వెనుకవైపు ఏదో అలికిడయినట్లయి తలత్రిప్పి చూశాడు ఫెర్రిరా. ఇద్దరు చైనీస్ అమ్మాయిలు. పెదాలకు ఎర్రటి లిప్ స్టిక్, మినీగౌన్సు వేసుకుని నవ్వుతూ ఫెర్రిరావైపు చూశారు.

హాంకాంగ్ వేశ్యలు!! ఫెర్రిరా మనసులోనే నవ్వుకుని 'విన్సెంట్ లుముంబా' అనే పేరు పెద్ద అక్షరాలలో రిజిస్టర్లో వ్రాశాడు.

"యూ ఆఫ్రికా?" అడిగాడు వృద్ధ చైనీస్ ఆశ్చర్యంగా.

"నో, నో, ఇండియన్."

"పాస్ పోర్ట్ ప్లీజ్ —"

బ్రీఫ్ కేస్‌లోనుండి పాస్ పోర్ట్ తీసిచ్చాడు ఫెర్రిరా అలియాస్ లుముంబా. ఆ పాస్‌పోర్టులో వ్యక్తి లుముంబాయే. విమానంలో హాంకాంగ్ వచ్చిన ఫెర్రిరా కాదు. వృత్తి చేపల ఎగుమతి. ఆ రోజు సాయంత్రం ఎనిమిది న్నరకు చిటగాంగ్ నుండి వచ్చినట్లు వ్రాసివుంది పాస్ పోర్ట్ ఎంట్రీ చికాలమ్‌లో. తలాడించి పాస్‌పోర్టు తిరిగి ఫెర్రిరాకు యిచ్చేశాడు చైనీస్. పాస్‌పోర్టుతో పాటు ఓ తాళంచెవి కూడా అందించాడు.

"ఫస్ట్ ఫ్లోర్‌లో కుడివైపు నాలుగవ గది. రూమ్ వన్ జీరో ఫోర్" అన్నాడతను బిగ్గరగా.

మెట్ల దగ్గరున్న అమ్మాయిలకు కూడా తన రూమ్ నెంబరు వినిపించాలని అతడలా అరిచాడని ఫెర్రిరాకు నవ్వొస్తూ తాళం తీసుకుని మెట్లవైపు నడిచాడు.

"హలో, డూ యువాంట్ కంపెనీ?" మెట్లకడ్డంగా నిలబడి అడిగింది ఇద్దర్లో పొట్టిగా, లావుగావున్న చైనీస్ యువతి.

తల అడ్డంగా ఆడించి మృదువుగా ఆమెను ప్రక్కకు నెట్టి పైకి నడిచాడు ఫెర్రిరా.

* * *

విరామం లేకుండా అరుస్తోన్న కుక్కల అరుపులకు మెలకువ వచ్చింది ముత్తురామన్‌కు. టార్చిలైటు, కర్ర చేతిలో పట్టుకుని గుడిసెలోనుండి బయటకు వచ్చాడు.

పదెకరాల భూమిలో వేసిన కూరగాయల తోటది. వంకాయలు, టమోటాలు కాపుకువచ్చి వున్నాయి. ఏ మాత్రం అప్రమత్తంగా వున్నా కోసుకుపోవడానికి చుట్టు ప్రక్కల లేబరుజనం కాచుకొని ఉన్నారని తెలుసు ముత్తుకు. అందుకే పగలంతా తను వెయ్యికళ్ళతో కాపలా కాసి, రాత్రిళ్ళు రెండు జాగిలాలకూ ఆ పని వప్పచెప్పేస్తాడు.

తోటచుట్టూ వదులుగా పేర్చిన కొండరాళ్ళ గోడ నాలుగడుగుల ఎత్తునవుంది. గోడవెంట ఆనవాలుగా యూకలిప్టస్ చెట్లు పెంచారు. కుక్కల అరుపులు గేటు వైపునుండి రావడం విని అటు బయలుదేరాడు.

"ఎవరది?"—గట్టిగా అరిచాడు ముత్తు. దొంగల్ని పట్టుకోవడం కాదు అతనిపని, దొంగలు రాకుండా చూడటం. తను మెలకువగానే వున్నట్లు తెలిస్తే ఆ

దొంగ పారిపోతాడని ముత్తు ఆశ.

ముత్తు స్వరంవిని కుక్కలు పరిగెత్తుకు రాలేదు. అక్కడే వుండి ఇంకా పెద్దగా అరవడం మొదలు పెట్టాయి. అంటే తను వస్తున్నానని తెలిసినా ఆ దొంగ పారిపోవడం లేదన్నమాట.

"ఎవరక్కడ? మాట్లాడరేం?" ఇంకా బిగ్గరగా అరిచాడు ముత్తు.

"ముత్తూ! నువ్వేనా?" ఎవరిదో స్వరం. ఎక్కడో విన్నట్లున్న స్వరం. ముత్తు గబగబా గేటువైపు అడుగులు వేశాడు.

గేటుకవతల ఎవరో నిలబడి ఉన్నారు. కుక్కలు రెండూ గేటు కివతల నిలబడి చెవులు చిల్లులు పడేలా అరుస్తున్నాయి. అతని ముఖంమీద పడేలా టార్చిఫోకస్ చేశాడు ముత్తు.

"నేనేరా ముత్తూ!"

జయపాండ్యన్‌ను చప్పున గుర్తుపట్టాడు ముత్తురామన్.

"నువ్వా?" అన్నాడు ఆశ్చర్యంగా ముత్తు. కుక్కల్ని అవతలకు తరిమి గేటు తెరిచాడు.

ముత్తు, జయపాండ్యన్‌లు హైస్కూలులో ఎనిమిదవ తరగతి వరకూ కలిసి చదువుకున్నారు. స్కూల్లో చదువుకునే రోజుల్లో ఇద్దరూ ప్రాణస్నేహితుల్లా తిరిగేవాళ్ళు. ముత్తు ఎనిమిదవ తరగతి వరసగా మూడేళ్ళు తప్పిన తరువాత వాళ్ళనాన్న చదువు మానిపించి కూలిపనికి పంపేశాడు. ఆ తర్వాత యిద్దరూ కలుసుకున్న సందర్భాలు చాలా తక్కువే అయినా ఇద్దరిమధ్య స్నేహం మాత్రం అలానే ఉండిపోయింది.

పాండ్యన్ ముఖం, వంటిమీద బట్టలు చెమటతో

తడిసిపోయి ఉన్నాయి. తల చెదిరిపోయి నుదుటిమీదకు పడుతోంది.

"ఏమిటి ఇంత అర్ధరాత్రి వచ్చావు?" ఆశ్చర్యంగా అడిగాడు ముత్తు తలుపుమూసి గుడిసెవైపు నడుస్తూ.

రెండు కుక్కల్లో ఒకటి ఇంకా గుర్రుమంటూ జయ పాండ్యన్ వెనకే వస్తోంది. ముత్తు క్షణం ఆగి దానివీపు నిమిరి మొక్కల మధ్యకు తోలేశాడు.

గుడిసెలోకి వచ్చేవరకూ పాండ్యన్ నోరు తెరవలేదు. "కాస్త మంచినీళ్ళిప్పిస్తావా?" అన్నాడు గుడిసెలో నులకమంచంలో కూలబడుతూ.

మాట్లాడకుండా కుండలో నీళ్లు సత్తుగ్లాసులో ముంచి అందించాడు ముత్తు. గ్లాసు నీళ్లు గటగటా తాగి చిన్నగా నిట్టూర్చాడు పాండ్యన్.

"రెండ్రోజులు యెవరికంటా బడకుండా గుడిశెలో తల దాచుకోవడానికి వీలవుతుందా?" — అడిగాడు పాండ్యన్.

నిశ్శబ్దంగా తలవూపాడు ముత్తు. "ఏం జరిగిందసలు?"

"సుమిత్రను చంపేశాను."

ఆశ్చర్యపోలేదు ముత్తు. ఏదో ఒక కారణంతో భార్యలను భర్తలు చంపి పారేయటం మామూలే ఆ ప్రాంతాలలో. దేశంలో భర్తల్ని భార్యలు, భార్యల్ని భర్తలు చంపుకునే కేసుల్లో డెబ్భయిశాతం ఆ జిల్లాలోనే జరుగుతాయి.

ఎందుకనికూడా అడగలేదు ముత్తు. కారణం చాలా తేలిగ్గా వూహించగలిగేడతను. జయపాండ్యన్ చాలా కాలంగా మిలట్రీలో ఉంటున్నాడు. అతని భార్య ఒక్కతే ఇక్కడ ఉంటోంది. హత్య జరగడానికి ఆ మాత్రం కారణం చాలు. (సశేషం)